క్లుప్తంగా

రేబాకలో కుంకుమ పూజ



రేబాకలో కుంకుమపూజకు హాజరైన మహిళలు

నక్కపల్లి : మండలంలో రేబాక గూడువమ్మతల్లి ఆలయం వద్ద కుంకుమ పూజ జరిగింది. కార్తీ మాసం చివరి సోమవారం కావడంతో రేబాక, తిరుపతిపాలెం, రేవళ్లు, రమణయ్యపేట, సీతానగరం, గుల్లిపాడు, డొంకాడ తదితర గ్రామాల నుంచి వందలాదిమంది మహిళలు ఈ కుంకుమ పూజకు తరలివచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారు 1500 మందికి పైగా మహిళలు ఈ కుంకుమ పూజకు హాజరు కావడంతో సందడిగా మారింది.

నిరాటంకంగా అయ్యప్ప భక్తులకు భిక్ష



మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో భిక్ష

మునగపాక : మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భిక్ష కార్యక్రమం సోమవారం నాటికి 47వ రోజుకు చేరుకుంది. భక్తుల విరాళాలతో ఆలయ ప్రాంగణంలో అయ్యప్పతోపాటు ఇతర భక్తుల సౌకర్యార్థం భిక్షను అక్టోబర్ 25న ప్రారంభించిన విషయం తెలిసిందే. నాటి నుంచి నేటి వరకు ఎటువంటి ఆటంకం లేకుండా భిక్ష కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతుంది. మునగపాకతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు ఈ భిక్షను సద్వినియోగం చేసుకుంటున్నారు.

రైతులకు పట్టాదారు పుస్తకాల పంపిణీ



రైతులకు పట్టాదారు పుస్తకం అందజేస్తున్న చూచుకొండ సర్పంచ్ సూరప్పారావు

మునగపాక : రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చూచుకొండ సర్పంచ్ దొడ్డి సూరప్పారావు అన్నారు. చూచుకొండ సచివాలయంలో సోమవారం రైతులకు పట్టాదారు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రీ-సర్వే ద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఈ విధానం ద్వారా భూ వివాదాలకు చెక్ పడుతుందన్నారు. అర్హులైన రైతులకు సకాలంలో పట్టాదారు పుస్తకాలు అందజేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



వికసిత్ సంకల్ప యాత్ర గురించి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): కేంద్ర ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాల గురించి ఎంపీడీవో విజయలక్ష్మి వివరించారు.అచ్యుతాపురం మండలంలోని చోడపల్లిలో సోమవారం వికసిత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ పథకాల గురించి ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎం.కామేశ్వరరావు,పలు విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుల పేటతుళ్లి

ఎస్.రాయవరం : మండల కేంద్రంలో అయ్యప్పమాల ధారణ భక్తులు పేటతుళ్లి నిర్వహించి, స్వామి అయ్యప్పకు పంబా స్నానం నిర్వహించారు. గ్రామంలో మాలధారణ చేసిన భక్తులు సుమారు రెండు వందల మందికి పైగా పాల్గొని గ్రామ పురవీధుల్లో అయ్యప్ప శరణ ఘోష వినిపిస్తూ అయ్యప్ప ఉత్సవ మూర్తిని ఘనంగా ఊరేగించారు.

రాంబిల్లి మండలంలో జేజేఎం అమలవుతున్న గ్రామాలు : **45**

మొత్తం పనులు : **51**

నిధుల కేటాయింపు : రూ.**18** కోట్లు

ఇంటింటా జల్‌ధారలు



- **జోరుగా ఇంటింటి కుళాయి పనులు**
- **జల్‌జీవన్ మిషన్‌తో తీరుతున్న వెతలు**
- **మండలంలో రూ.18 కోట్లతో పనులు**
- 45 గ్రామాలకు ఇంటింటా తాగునీరు సరఫరా
- నాలుగు గ్రామాల్లో ఇప్పటికే పూర్తయిన పనులు
- మరో ఏడు గ్రామాల్లో 60 శాతం పనులు పూర్తి





దిమిలిలో తమ ఇళ్ల వద్దే తాగునీరు పట్టుకుంటున్న మహిళలు

రాంబిల్లి: జల్ జీవన్‌మిషన్ పథకం ప్రజల దాహార్తిని తీరుస్తోంది. ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేస్తుంది. రాంబిల్లి మండలంలో రూ.18 కోట్లతో 51 పనులను ఈ పథకంలో చేస్తున్నారు. ఈ పథకం ద్వారా ఈ నిధులతో 17 గ్రామ సచివాలయాల పరిధిలో గల 45 గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే హరిపురం, పంచదార్ల, వెంకయ్యపాలెం, వాడపాలెం గ్రామాల్లో ఈ పనులు పూర్తయ్యాయి. దిమిలి, పెద కలవలాపల్లి, మర్రిపాలెం, రజాల, వాడనర్సాపురం, కొత్తపట్నం, వై.లోవ గ్రామాల్లో 60 శాతం పనులు పూర్తయ్యాయి. పూర్తయిన వీధుల్లో గల ఇళ్లకు ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరును సరఫరా చేస్తున్నారు. మిగిలిన గ్రామాల్లోనూ పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఏళ్ల తరబడి మండల ప్రజలు తాగునీటి సమస్యతో సతమతమవుతున్నారు. ముఖ్యంగా పలు గ్రామాల్లో బోర్లు తవ్వినా ఉప్పు శాతం కారణంగా తాగునీరు సమస్య వుండేది. ఇప్పుడు మంచి నీరు పడే గ్రామాల్లో బోర్లు వేసి పైపులైన్ ద్వారా తాగునీరును సరఫరా చేయనున్నారు. ఈ మేరకు అవసరమైన చోట్ల ట్యాంకు లను నిర్మిస్తున్నారు. ఈ పనులు పూర్తయితే ప్రజలకు ఎంతో మేలు జరిగినట్టవుతుంది. ప్రధానమైన తాగునీటి సమస్య తీరనుంది.





హరిపురం, పంచదార్ల గ్రామాల్లో కుళాయిలు ఏర్పాటు చేస్తున్న వర్కర్లు

తాగునీటి సమస్య తీరుతుంది



జల్‌జీవన్‌మిషన్ పథకంలో మా గ్రామంలో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పలు వీధుల్లో పనులు పూర్తయి కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఈ పనులు పూర్తి స్థాయిలో పూర్తయితే తాగునీటి కష్టాలు తప్పుతాయి

-బంగారు చిలుకు , సర్పంచ్, దిమిలి

ఆనందంగా ఉంది



మా హరిపురం గ్రామంలో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయడంతో ఎంతో ఆనందంగా ఉంది. తాగునీరు కోసం దూరంగా పోయే బాధ తప్పింది. ఇంటి వద్దే తాగునీటి సౌకర్యం అందుబాటులోకి తీసుకువచ్చి ప్రభుత్వం మేలు చేసింది.

– ధూళి అప్పారావు(బుజ్జి), సచివాలయ కన్వీనర్, హరిపురం

అవస్థలు తప్పాయి..



వృద్ధాప్యంలో వున్న నేను తాగునీటి కోసం నానా అవస్థలు పడేదాన్ని. సుదూరం వెళ్లి తెచ్చుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు మా ఇంటి వద్దే కుళాయి ఏర్పాటు చేశారు. ఈ కుళాయి ద్వారా తాగునీరు పట్టుకుంటున్నాను. చాలా సంతోషంగా ఉంది.

-జనపాల వరలక్ష్మి, వృద్ధురాలు, దిమిలి

ఎంతో మేలు



ఇంటి వద్దే తాగునీరు కుళాయి ఏర్పాటు చేసి నీరు సరఫరా చేయడంతో సులువుగా సౌకర్యవంతంగా నీరు పట్టుకుంటున్నాం. పబ్లిక్ కుళాయిల వద్ద ఎంతో సేపు నిలబడి గతంలో నీరు తెచ్చుకోవాల్సి వచ్చేది. తోపులాటలు సైతం చోటుచేసుకునేవి. ఇప్పుడీ సమస్యలు తప్పాయి.

-ఎస్. నాగ వెంకటలక్ష్మి, దిమిలి

త్వరితగతిన పూర్తి చేస్తాం



ఇప్పటికే నాలుగు గ్రామాల్లో పనులు పూర్తి చేసి నీరు సరఫరా చేస్తున్నాం. అంతే గాక మరో ఏడు గ్రామాల్లోనూ 60 శాతం పనులు పూర్తి చేసి తాగునీరు సరఫరా చేస్తున్నాం. మిగిలిన చోట్ల పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి తాగునీరు సరఫరా చేస్తాం. ఈ పనులు పూర్తయితే తాగునీటి సమస్యలు తీరిపోతాయి.

-వర్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ

ప్రతి ఒక్కరి సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం



మునగపాకలో ప్రభుత్వ పథకాల లబ్ధి డిస్‌ప్లేను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరికీ మేలు చేయడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు అన్నారు. ఇంతవరకు ప్రభుత్వ పరంగా అందిన లబ్ధిని గుర్తించి వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి మరో అవకాశం ఇవ్వాలన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మునగపాక -1 సచివాలయంలో ప్రభుత్వ పథకాల ద్వారా అందిన లబ్ధికి సంబంధించిన డిస్‌ప్లేను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వానికి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య తేడాను గుర్తించి రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, పార్టీ నాయకులు పిల్లి అప్పారావు, కొండలరావు, శ్రీరామమూర్తి, కాండ్రేగుల జగన్, మందా రాము, జానకీరామ్ పాల్గొన్నారు. అనంతరం నందిగుడి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఎమ్మెల్యే రమణమూర్తిరాజు ఆవిష్కరించారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



తోటాడలో జల్‌జీవన్ మిషన్ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

మునగపాక : జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా తాగునీటి సమస్యలకు పరిష్కారం కలుగుతుందని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి అన్నారు. మండలంలోని తోటాడ పంచాయతీలో ఇంటింటి కుళాయి పనులకు సోమవారం ఆమె భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయిలు త్వరితగతిన ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు షేక్ ఇస్మాయిల్, దొడ్డి కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కాండ్రేగుల లక్ష్మీనారాయణ, సచివాలయ కన్వీనర్ గంగాజీ, వార్డు సభ్యులు పీఎం నాయుడు పాల్గొన్నారు.

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన



నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నక్కపల్లి : ఈవీఎంల వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. సోమవారం నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అంబేద్కర్, డిప్యూటీ తహసీల్దార్ నీరజలు పలువురు ఓటర్లకు ఈవీఎంలను ఎలా ఉపయోగించాలనే దానిపై వివరించారు. ఈవీఎంలను తెరవడం, ఓటు హక్కు వినియోగించుకోవడం, సీల్ చేయడం వంటి విషయాలను తెలియజేశారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును ఈవీఎంల ద్వారానే వినియోగించుకోవడం జరుగుతుందని తహసీల్దార్ అంబేద్కర్ తెలిపారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీసం నానాజీ, సర్పంచ్ సూరిబాబు పాల్గొన్నారు.

సంక్షేమానికి మారుపేరుగా జగనన్న పాలన



సంక్షేమం, అభివృద్ధి డిస్‌ప్లే బోర్డును ప్రారంభిస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని ఉమ్మడి జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు అన్నారు. అరట్లకోట గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు చేపట్టిన పాదయాత్రలో స్వయంగా ప్రజల కష్టాలను పరిశీలించిన, వాటినే ఎన్నికల హామీలుగా చేసుకున్నారన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను నేరవేర్చిన ఘనత సొంతం చేసుకున్నారన్నారు. సంక్షేమ పథకాలు యథాప్రకారం కొనసాగాలంటే మనందరం మరలా జగన్‌మోహన్‌రెడ్డికే పట్టం కట్టాలన్నారు. అంతకు ముందు గ్రామానికి విడుదలైన రూ.22 కోట్ల సంక్షేమ లబ్ధికి సంబంధించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. సమావేశంలో జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, గ్రామ శాఖ అధ్యక్షుడు తూము రమణ, సచివాలయ కన్వీనర్లు ఎద్దు గుణశీల, అప్పారావు, పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, సర్పంచ్‌లు రామారావు, బాబ్జి, గెడ్డమూరి శ్రీను, కోటేశ్వరరావు, ఎంపీటీసీలు నరేష్, శేఖర్, లోవకుమార్ పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా..ఉత్సాహంగా సాగాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న పీడీ సత్యనారాయణ



శిక్షణకు హాజరైన సచివాలయ సిబ్బంది, వలంటీర్లు

ఎస్.రాయవరం : గ్రామాల్లో ఆడుదాం ఆంధ్రా..కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించాలని ఎంపీడీవో రామచంద్రమూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లకు, గ్రామ కార్యదర్శులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మరో రెండు రోజుల నుంచి సచివాలయాలు వారీగా నిర్వహించాల్సిన క్రీడలపై శిక్షణ ఇచ్చారు. ఉన్నత పాఠశాలలో పనిచేసే పీడీల నుంచి క్రీడల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. బ్యాడ్మింటన్, క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలపై శిక్షణ ఇచ్చారు.

చంద్రబాబు అభివృద్ధి లెక్కలు కాగితాల్లోనే...

- నిజమైన అభివృద్ధి ఏమిటో జగనన్న చూపారు
- మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి



అల్లూరి కాలనీలో సంక్షేమ డిస్ ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

యలమంచిలి : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి అభివృద్ధిని కేవలం కాగితాల్లోనే లెక్కలు కట్టి చూపించాడని, అక్కడ ఆయన ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని, 36వేల ఎకరాల్లో రాజధాని నిర్మాణం జరగాలంటే రాష్ట్ర ఖజానా ఖాళీ అవుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అన్నారు. వై ఏపి నీడ్స్ కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం యలమంచిలి పట్టణం అల్లూరి సీతారామరాజు కాలనీ సచివాలయం పరిధిలో ఉన్న 18,19 వార్డుల్లో ఆంధ్రాకి జగనే ఎందుకు కావాలంటే..కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ఆలోచనతో అభివృద్ధి చెందిన, అన్ని వనరులు ఉన్న విశాఖపట్నంలో కార్యనిర్వాహక రాజధానిగా ఎంపిక చేశారన్నారు. గత 50 ఏళ్లలో ఏ ప్రభుత్వం అయినా ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతు పనులు చేపట్టిందా అన్ని ప్రశ్నించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో విద్యార్థులకు అన్ని మౌలిక వసతులతో కూడిన విద్య, పోషక విలువలు ఉన్న ఆహారాన్ని అందించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దారని అన్నారు. గత ప్రభుత్వంలో వృద్ధులకు పింఛన్లు అరకొరగా ఇచ్చేవారని, జగనన్న ప్రభుత్వంలో అర్హత కలిగిన నిరుపేదలందరికీ పింఛన్లు, జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరు చేశారని అన్నారు. ప్రజలను ఓటు అడిగే హక్కు సీఎం జగన్ మోహన్‌రెడ్డికే ఉందన్నారు. అల్లూరి సీతారామరాజు కాలనీలో రూ.27 కోట్లతో అన్ని విధాలుగా అభివృద్ధి .పనులు చేశామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కాలనీలో యానాద్రి కాలువ కష్టాలు తీర్చి, ముంపు నుంచి కాపాడే రక్షణ చర్యలు చేపట్టామని, రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ సమస్యలు తీర్చామని తెలిపారు. యలమంచిలి మార్కెట్ కమిటీ చైర్మన్ యర్రయ్యదొర, కౌన్సిలర్లు కావ్య, భార్గవి, నాయకులు పడాల శ్రీను, జోగా వెంకటరమణ, గొర్లె వెంకట్, మున్సిపల్ కమిషనర్ కొండలరావు, మున్సిపల్ మేనేజరు ప్రభాకరరావు పాల్గొన్నారు.

బ్రాండిక్స్‌లో రక్తదాన శిబిరం



బ్రాండిక్స్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరం

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండెక్స్ ఇండియా అపెరల్ పార్కులో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు.రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 25 మంది రక్తదానం చేశారు.ఈ సందర్భంగా బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి మాట్లాడుతూ ఇప్పటి వరకూ బ్రాండిక్స్‌లో 10 శిబిరాలు నిర్వహించగా మొత్తం 150 మంది రక్తదానం చేశారని తెలిపారు.

పంట నష్టం నమోదు ప్రారంభం

రాంబిల్లి: మిచాంగ్ తుపానుతో దెబ్బతిన్న వరిపంట నష్టం నమోదు ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఏవో సుమంత దిమిలి, కట్టుబోలు, మామిడివాడ గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న వరిపొలాలను పరిశీలించారు. ఈ నెల 18వరకు పంట నష్టం పరిశీలించి రైతుల వివరాలను నమోదు చేస్తామన్నారు. పంచాయతీలు, ఆర్‌బీకేల వద్ద జాబితాలను ప్రదర్శిస్తామన్నారు. గ్రామాలకు తమ సిబ్బంది పరిశీలనకు వచ్చినపుడు రైతులు దెబ్బతిన్న వరి పంట పొలాలు చూపించాలని ఏవో సూచించారు.

వైభవ వేంకటేశుని ఆలయంలో అన్న సమారాధన



వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న కోలాటం



ఆలయంలో అన్న సమారాధన

ఎస్.రాయవరం : స్థానిక శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న సమారాధన చేశారు. పూజల అనంతరం స్థానిక మహిళలతో నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. జెడ్పీటీసీ కాకర దేవి, వైస్ ఎంపీపీ గోవిందరావు, జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ శారదాకుమారి పూజల్లో పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల ఊరేగింపు

మునగపాక : మునగపాకలో పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. రెండతస్తుల గుమ్మటంలో శివపార్వతులను ఉంచి సంతబయిల, మధ్యవీధి, పంచాయతీ వీధి, గౌరీ పరమేశ్వరుల ఆలయం మీదుగా సాంబశివుని ఆలయానికి ఊరేగింపు నిర్వహించారు. ఆలయ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెంటకోట ఆదినారాయణ,సూరిశెట్టి రాము, కాండ్రేగుల జగ్గారావు,ఆడారి కాశీబాబు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం కోరుతూ ఆందోళన

మునగపాక : తుపానులో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ మునగపాకలో రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన నిర్వహించారు. మునగపాక మెయిన్‌రోడ్డులో మానవహారం చేసి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం, టీడీపీ, జనసేన పార్టీలు ఆందోళనకు మద్దతు తెలిపాయి. రైతు సంఘ అధ్యక్షుడు ఆడారి మహేష్ మాట్లాడుతూ తుపాను సంభవించి రోజులు గడుస్తున్నా, ఇంతవరకు నష్టపరిహారానికి సంబంధించి ప్రభుత్వం చర్యలు చేపట్టలేదన్నారు. తక్షణమే అధికారులు నష్టాన్ని అంచనా వేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు.

మార్మోగిన శివనామస్మరణ



మునగపాక లింగరాయి గుడిలో అభిషేకాలు

మునగపాక : కార్తీకమాసం ఆఖరి సోమవారం సందర్భంగా వాడ్రాపల్లిలోని దక్షిణేశ్వర స్వామి ఆలయం, సిరసపల్లిలోని వీరభద్ర స్వామి ఆలయం,నాగులాపల్లిలోని పురాతన శివాలయం, మునగపాక లింగరాయి గుడిలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

యలమంచిలి(అనకాపల్లి రూరల్): కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా శివాలయాల్లో అభిషేకాలు, బిల్వార్చనలు,ప్రత్యేక కుంకుమ పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించారు. కొత్తపేట,శేషుగెడ్డ శివాలయాలతో పాటు అచ్యుతాపురం బైపాస్ రోడ్డు సోమస్కంధమూర్తి ఆలయం,ఏటికొప్పాక తదితర శివాలయాల్లో రుద్రాభిషేకాలు నిర్వహించారు.

రాంబిల్లి: కార్తీక సోమవారం పంచదార్ల పుణ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆకాశధార వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం క్షేత్రపాలకుడైన ఉమా ధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకొన్నారు. ఈవో సాంబశివరావు, ఉత్సవ కమిటీ ప్రతినిధి అర్జునరావు క్యూలైన్లు పర్యవేక్షించారు.